# స్వీకారం

"రాఘవ"

ఆ నాడు శ్రావణ శుక్రవారం. పౌర్ణమి. సావిత్రి ఒంటరిగా మేడమీద పిట్టగోడపై కూర్చొని, చుట్టూ గుడ్డివెన్నెల్లో తడిసి పోతూవున్న ప్రకృతిని అవలోకిస్తోంది. మేడక్రింద సీతాపతి, తల్లికాంతమ్మ యేవో విషయాన్ని మాట్లాడు కొంటూవున్నారు. సావిత్రి తల్లి పార్వతి ఆ నాడు పేరంటానికి వెళ్లి యింకా తిరిగిరాలేదు. పార్వతిని పిల్చిన అమ్మలక్కలంతా సావిత్రిని కూడా పేరంటానికి తీసుకొని రానందుకు యెన్నో ప్రశ్నలువేసి విసుగెత్తించారు. పార్వతి యేవేవో సమాధానాలు యిచ్చి తప్పుకొంది. అయినా హృదయంలో -'సావిత్రినికూడా పేరంటానికి తీసుకొస్తే యెంత బాగుండేది'-అని పరితప్తపడింది. సావిత్రికి యిదంతా యేమీ పట్టించుకోదల్చుకోవాలనిపించలేదు. ఒక వేళ తల్లి తిరిగివచ్చి 'నలుగురూ యిలా అన్నారు'- అని బాధగా చెప్పినా వినిపించుకోవాలనిపించలేదు. అక్కడికీ పేరంటాళ్లు పిల్చి వెళ్ళగానే, పార్వతి ముస్తాబు అవుతూ, సావిత్రిని మరీమరీ రమ్మనమనీ, రాకపోతే బాగుండదనీ, నలుగురూ నన్నదేదో విధంగా అడుగుతారనీ, వాటికి జవాబులిచ్చుకోలేక అబద్ధాలు చెప్పాల్సొస్తుందనీ, బయలుదేరి, వీధిగుమ్మందాటుతూన్నంతవరకూ సణుగుతూ అంటూనేవుంది. సావిత్రి మౌనంతో, తన కేమీ పట్టనట్టుండిపోయింది. తిరస్కారభావాన్ని స్ఫురింపచేయటం - విసుక్కోవటం - మొదలైనవి చేసింది. పార్వతికీస్థితియేమీ అర్థంకాలేదు. ఏంచేయాలో తోచలేదు. బలవంతంగా రెక్క పుచ్చుకొని లాక్కొని పోదామంటే సావిత్రి యేమీ చిన్నపిల్ల గాదు. పద్దెనిమిది సంవత్సరాలున్న గారాబు పట్టి. శ్రావణశుక్రవారం – వరలక్ష్మీవ్రతం – అమ్మలక్కలంతా సంతోషంగానూ – భక్తితోనూ నోచుకుంటారే! అమ్మవారిని చూసిరావాలే! అని కూడా తెలియదా! అని అనుకొంటే, సావిత్రికి బాగా తెలుసు. స్త్రీలపాలిట వరలక్ష్మీవ్రతం యెంత ప్రాముఖ్యమైందో సావిత్రికి తెలియకపోలేదు. స్కూల్ ఫైనల్ వరకూ చదువుకొన్న సావిత్రికి చాలా బాగా తెలుసు. ఎంత బ్రతిమిలాడినా సావిత్రి రాకపోయేసరికి, పార్వతి పెళ్లీడుకొచ్చిన దాన్ని యేమీ అనలేక – "ఇదంతా నాకర్మ" అని మనస్సులోనే అనుకొని పేరంటానికి వెళ్లిపోయింది.

రెండు రోజుల్నుంచి సీతాపతి – కాంతమ్మ తీరుబడిగా కూర్చొని ప్రస్తావించే విషయం యేమిటో – అసలా సమాలోచనా సారాంశం యేమిటోసావిత్రికి యీ నాటివరకూ, యీ వేళవరకూ అవగతంకాలేదు, మొత్తానికది 'తన పెళ్లి విషయమే'నని మాత్రం యించుక గ్రహించగల్గింది. ఎంతవరకైతే తానావిషయాన్ని స్ఫుటంగా విని, మనస్ఫూర్తిగా అర్థంచేసుకొందో, దాన్ని మాత్రం తీరిక దొరికినప్పుడల్లా యేకాంతంగా కూర్చొని యెడతెగని ఆలోచనలతో నెమరువేసుకో సాగింది. ప్రయోజనం తృప్తిగా యేవిధంగానూ అంతరాత్మకు లభించటంలేదు.–"అమ్మకైనా యీ విషయం తెలియకుండా వుంటుందా ?" అనీ తనలో తాను ఒక్కొసారి ప్రశ్నించుకొనేది. దానివల్ల ఒక వేళకల్గేలాభం యేమిటి? అయినా పార్వతిని అడిగి తెలుసుకుందామనుకొంది వచ్చీరాంగానే.

సహజంగానే సావిత్రికి యే సందేహం కల్గినా, యే అనుమానం వచ్చినా పార్వతి నడిగి తెలుసుకొని సంతృప్తి పడుతూవుంటుంది. కన్న తల్లి తన కష్టం తెలుసుకొని తీర్చకపోతే, మరెవ్వరీలోకంలో తీర్చగలరనే విశ్వాసం సావిత్రికి నిలువెల్లా వుంది. అందువల్ల, తన పెళ్ళినిగురించి, ఏర్పడిన ఆలోచనాత్మకమైన ప్రశ్నలను తల్లికి ఎరుకపరిస్తే తీరిపోతయి – తనజీవితం సుఖపూరిత మవుతుందని సావిత్రి ఆశించింది, సూటిగా తల్లికెలా తెలియపర్చాలో తోలిగా సావిత్రికి అర్థంకాలేదు. కాసేపు యింకా అదేవిధంగా ఆలోచించి – ఒక్కింత తెప్పరిల్లి – తన చదువూ – సంస్కారం – భావప్రకటన మొదలైనవాటిని గుర్తుకి తెచ్చుకొంది. హృదయాన్ని

ధైర్యంలో నింపుకోంది. తండ్రీ — నాయనమ్మా చేసే ప్రయత్నాలకూ — రహస్యసమాలోచలకూ — గుసగుసలకూ — తర్జన భర్జనలకూ — సందివ్వకుండా తన జీవితం పరాయి వాడికి అంకితం కాకుండా చేసుకోవాలనిపించింది. ఎలాగైనా సరే తన హృద్భావాన్ని యీ రాత్రే, తల్లికి ఎరుకపర్చాలని నిశ్చయించుకోంది. చుట్టూచూచింది. ఆకాశం మేఘావృతంకాబోతోంది. మసక వెన్నెల క్రమేపీ చిక్కబడుతూవుంది. యీపాటికి 'అమ్మ వచ్చేసేవుంటుంది' — అని భావించి చటుక్కున పిట్టగోడమీదనుంచి లేచి, గబగబ మెట్లుదిగి క్రిందకు వచ్చేసింది,

ఇంకా అప్పటికి పార్వతి పేరంటంనుంచి తిరిగి రాలేదు 'భోజనాలవేళయినా పార్వతియింకాతిరిగి రాలేదేమా'! అని కాంతమ్మ వుక్రోషంతో సణుగుతోంది. సీతాపతిమాత్రం వసారాలో ఒంటరిగా కూర్చొని — యేమిటో దీర్ఘాలోచన చేస్తున్న సావిత్రివంక చూస్తూ — "మాఘమాసంలో యెలాగైనాసరే నీ పెళ్లిచేయక తప్పదమ్మా!" — అని మనసులో స్థిమితంగా అనుకున్నాడు. మధ్యమధ్య సావిత్రి, తండ్రివంకచూస్తూ తన తీవ్రాలోచల్ని కొనసాగిస్తూండగా, సీతాపతి ముఖంలో కవళికలు క్రొత్తగా కనిపించసాగినాయి. సావిత్రి వాటిభావాన్ని కొంతవరకు అర్థంచేసుకొనటానికి ప్రయత్నించసాగింది.

"నాన్న — నాయనమ్మా తనకి పరాయివాణ్ణిచ్చి చేస్తారేమో"— అని సావిత్రి ఒక విధంగా బాధపడసాగింది. వాస్తవంగా యీ బాధ సావిత్రిలో యింత త్వరితంగా కల్గడానికి, సీతాపతి - కాంతమ్మ లోగడనుంచి జరుపుకొస్తున్న రహస్యసమాలోచనల సారాంశమే ముమ్మాటికి కారణం.

ఇంతగా సావిత్రి బాధపడుతున్నా, ఒకమొండి ధైర్యం ఎందుకో ఒకమూల, హృదయంలో దాక్కొని వుండి - "నీకలా అన్యాయంచేయరులే నాన్న — నాయనమ్మానూ!" అని ఓదార్చసాగింది. సావిత్రికి యెంత ఆలోచించుకొన్నా "సుఖపడగలననే" భావం తప్పమరేదీ అడ్డు తగిలి విసిగించటంలేదు. కన్నవారెప్పుడూ తనగొంతుక కోస్తారని ఆశించలేదు. తన జీవితం కలకాలమూ సుఖప్రదంకావాలని విశ్వసిస్తూ తల్లికోసం ఎదురు చూడ సాగింది.

ఇంతలో గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. పార్వతి యింకారాలేదు. సీతాపతి మాత్రం భోజనానికి లేచి వెళ్ళిపోయాడు. సావిత్రి అలాగేకూర్చొని — "యింకారాలేదేమిటీ?" అని తనలో తాను ప్రశ్నించుకొంటూ, వీధివైపు ఆత్రుత నయనాల్తో చూస్తూవుంది.

పార్వతి రాలేదు.

"ఇంత సేపా! పేరంటానికిపోతే! ఇక ఎక్కడికి పోతే అక్కడేనా! యిట్టా యిల్లూవాకిలీవున్నయ్యనే జ్ఞాపకం వుండా అని! ఇలాంటి వాళ్ళని యింతవర కెప్పుడూ చూడలేదు. అత్తగారుంది గదా! ఆ మాత్రం కొడుక్కి అన్నంపెట్టుకోలేదూ, అనేగా! అందరి కోడళ్లూ అత్తగారిపట్ల యిలాగే వున్నారా! బొత్తిగా యింటి విషయాల్ని పట్టించుకోదు. యిక యీ సంసారం యెలాబాగుపడుతుందోగానీ, భగవంతుడా! నాకేం అర్థంకావటం లేదు."—అని ఏకధాటిగా కాంతమ్మ వంటింట్లో సీతాపతికి వడ్డనచేస్తూ, పార్వతిని దూయబట్ట సాగింది. యిప్పటికి కాంతమ్మ పార్వతి పేరంటానికి వెళ్ళినందుకు, మూడుసార్లు మూతి విరుపులతోనూ — రుసరుసలతోనూ దుమ్మెత్తిపోయటం పూర్తిచేసింది.

వసారాలో స్తబ్ధుగా కూర్చున్న సావిత్రిగుండె, నాయనమ్మ ఎత్తిపొడుపు మాటలకి తరుక్కుపోయింది—'ఎన్నడూ గుమ్మందాటి పోని, అమ్మను యీవిధంగా శ్రావణశుక్రవారం పూట చివాట్లు పెడుతోందని,' చెప్పరానంతకోపం ముంచుకొచ్చింది. తనింకా బ్రతికివుండగా, కన్నతల్లిని, నాయనమ్మ ఆ విధంగా దెప్పిపొడవటం సావిత్రి చూస్తూ చూస్తూ సహించలేకపోయింది. 'అమ్మను అనవుసరంగా ఆడి పోసుకొంటోందని' సావిత్రికి పట్టరానంతరోషం తరుముకొచ్చింది. అమ్మ తరఫున వకల్తా పుచ్చుకొని, నాయనమ్మతో మాటకిమాట అందామని ప్రయత్నించింది. కాని రసాభాస అవుతుందని జంకింది. 'నాయనమ్మకూడా ఒకప్పుడు యీ యింటికి కోడలేగా! అదృష్టంతోసుకొని రాబట్టి మానాన్నని కన్నది. మాఅమ్మను కోడలిగా చేసుకొంది. యింత మాత్రానికే తాను గొప్ప హోదాలో వున్నట్లు చెలామణికావాలా? ఏమిటీమిడిసిపాటు? అమ్మను అనవుసరంగా మాటలనటం దేనికి? పేరం

టానికి వెళ్లిన అమ్మ తిరిగిరాకుండా వుంటుందా?'_ అని తనలో తాను సంబాళించుకొంటూండగా ఎనిమిదన్నరైంది.

ఇంతలో వీధిలో తలుపు చప్పుడైంది. చిటపట చినుకులు పడుతున్నాయి. సావిత్రి తేరిపారచూసి_ "అమ్మా!" అని పిల్చింది. పార్వతి _ 'ఆఁ... నేనే' అంటూ శ్రావణలక్ష్మి లాగా వసారాలోనికి వచ్చి, శనగల మూట చేతిలోపెట్టి _ "నువ్వు రాలేదని ప్రతివారూ అడగటమే! చెప్పలేక విసుగెత్తిందనుకో" అన్నది. ఆ సమయానికి సీతాపతి కూడా మూతి తుడుచుకుంటూ వసారాలోకి వచ్చి, జారుడు కుర్చీలో చతికిలపడ్డాడు. తల్లి అన్నమాటకి, సావిత్రి బదులు యేమీ చెప్పలేదు. కాంతమ్మ మాత్రం వూరుకోక, వున్న అక్కసునంతా వెళ్ళగ్రక్కుతూ -

"నువ్వు వెళ్లిందిచాలక, దాన్నికూడా వూరంతా తిప్పుదామనుకున్నావా? పెళ్ళీడుకొచ్చినదాన్ని ఎలా వెంట తీసుకొని పోదామనుకున్నావ్? ఆ మాత్రం యింకా తెలియదుటే" అంది.

"శ్రావణ శుక్రవారం పూట, అమ్మ వార్ని చూడటంకూడా తప్పేనా?" _ అని తనలో తాను ప్రశ్నించుకొంది పార్వతి. అక్కణ్ణుంచి కాంతమ్మ మరికొంత సేపటివరకూ చిర్రుబుర్రులాడుతూనే వ్యాఖ్యానించింది. తన కాలపు రోజుల్ని - యీ కాలపు రోజుల్ని చెడామడా విమర్శించి, పార్వతిని చిన్నబుచ్చింది. సావిత్రి యిక వుండబట్టలేక _

"అనవసరంగా అమ్మమీద ఎందుకట్లా నోరు చేసుకుంటావ్ బామ్మా! ఏంపాపం చేసిందని వూరిక్కే శ్రావణ శుక్రవారం పూట చివాట్లు పెడతావ్! యిందాకన్నుంచి వింటూవున్నా, పోనీలే! వూరుకుంటావ్‌గదా అని చూస్తూంటే, మరీ విపరీతం అయిపోతోంది. ఒకవైపు నాన్న వున్నప్పుడు కూడా నువ్విలా మాట్లాడటం న్యాయంగాదు. నేనుండగా యికనుంచి అమ్మను యేమన్నా సరే వూరుకోను" అని గంభీరంగా కాంతమ్మ కెదురు తిరిగి నిలబడి, ఆవిడ గారి గొంతుకన్నా _ కాస్త హెచ్చించి అరిచింది.

కాంతమ్మ నిలువునా స్తంభించిపోయింది. సావిత్రి యీవిధంగా తల్లి తరఫున నిలబడి అకస్మాత్తుగా జవాబిస్తుందని కల గనలేదు. ఇలా అంటుందని వూహించలేదు. ఒక్కసారిగా తెల్లబోయింది. పార్వతి నిర్విణ్ణురాలైంది. సీతాపతి అదిరిపడి లేచి సావిత్రి వంక నివ్వెరపోతూ చూసాడు. తేలుకుట్టిన దొంగలాగా కాంతమ్మ నెమ్మదిగా వెనక్కి తిరిగి వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఆరాత్రి కాంతమ్మ అన్నం తినటం పూర్తయినాకే, పార్వతి - సావిత్రి తిన్నారు.

ఇంతటి విపరీత పరిణామం సావిత్రిలో యెందుకు కల్గిందో, సీతాపతికి తెలియలేదు. పార్వతికి పాలుపోలేదు _ కాంతమ్మకి అర్థంకాలేదు. ఎవరికి వారే ఆలోచించుకొంటూ ఆ రాత్రి గడిపారు.

## 2

శ్రావణ శుక్రవారం - పౌర్ణమి నాడు జరిగిన సంఘటనానంతరం రెండుమూడు వారాలు గడిచినా యిల్లంతా నిశ్శబ్దంగానే వుండిపోయినది. కాంతమ్మ దృష్టిలో పార్వతి _ సావిత్రి ఒకటై, తనమీద కత్తి కట్టి, యిల్లంతటికీ ఏకఛత్రాధిపత్యం వహించి, తన్నొంటరిదాన్ని చేసి . ఏడిపించాలనుకొంటున్నారని అపోహపడింది. ముసిలిదాన్ని గదా! అని చులకన భావం ప్రకటిస్తూ, తనచేత యింటెడు చాకిరీ చేయించాలని కుతంత్రాలు పన్నుతున్నారని దురభిప్రాయపడింది.

తల్లిని వెనకేసుకొచ్చి సావిత్రి ఆనాడు అలా, కొడుకుముందు తన్ను చిన్నబుచ్చుతూందని కాంతమ్మ కలగానైనా తల్చలేదు. ఆనాడు సావిత్రి అన్న మాటలు మాటిమాటికీ కాంతమ్మ చెవుల్లో యీనాటివరకూ గింగురుమంటూనే వున్నాయి. ఒక్కొక్కసారి ఆ మాటల్ని తల్చుకొంటే, జడుపు కల్గుతున్నట్లుండేది. కంగారు పుట్టేది. చివరకు అదే యావతో శరీరమంతా చెమటపట్టి, కంపరమెత్తినట్లుండేది. విశ్రాంతిగా కూర్చున్నప్పుడల్లా సావిత్రి గుర్తుకొచ్చేది. తన వయస్సు ఎంత? సావిత్రి యీడెంత? అని తనలో తాను వింతగా తల్చుకొని వులిక్కిపడుతూండేది. తన కళ్ళముందు పుట్టిన బొప్పికాయలు కూడా తన్నిలా భయపెట్టటం ఎంత చోద్యంగా వుంది! అని ముక్కుమీద వ్రేలుంచుకునేది.

సావిత్రికి కాంతమ్మమీద వ్యక్తిగతంగా యే దురభిప్రాయమూ లేదు. నాయనమ్మమీద ఆనాడు వచ్చిన కోపం ఆనాడే సమసిపోయింది. పార్వతికి మాత్రం, సావిత్రి స్థితి యింతవరకూ బోధపడలేదు. కాని, యింట్లో ఒక్కసారిగా యింతటిమార్పు వచ్చే

సరికి కాంతమ్మ, సీతాపతి ఒకవైపైనట్లు — పార్వతి, సావిత్రి మరొకవైపైనట్లు పరస్పరంగా భావించు కున్నారు. ఎడమొగాలు - పెడమొగాలైనవి. ఎవరి పనులు వాళ్లే చేసుకొంటున్నామని ఆంతర్యంలో అనుకోవటం వరకూ జరిగినా, ఫలితం మాత్రం ఒకరి నుండి మరొకరు పొందుతూనే వున్నారు! చిత్ర మేమిటో మరి. కాంతమ్మ మాత్రం — "ఇదివరకు లాగా నేను యింటెడు చాకిరీ చేయడానికి ఓపిక లేదు. ఆ వేళకి కుడిగట్టుకొని, ఆ నాల్గు మెతుకులూ వండిపడేస్తాను. యిష్టం వున్నవాళ్లు తినండి. లేనివాళ్లు మానుకోండి. నే చేయలేను నాయనా! యీ గంపెడు చాకిరీనూ" అని నిత్యమూ అనుకునేది. తీరా చూస్తే యింటెడుపనీ ఆమెగారే స్వహస్తాలతో చేస్తూ వుండేది. పార్వతిలోగానీ, సావిత్రిలోగానీ, కాంతమ్మ కున్న వుద్దేశ్యంలాంటిది యిసుమంతయినా వుండేది గాదు.

పార్వతి కాపురానికి వచ్చిన లగాయితూ - "తాను యీ యింటికి కోడల్ని గదా! నా పని నేను చేసుకున్నానని చేతులు దులుపుకోవటం భావ్యం గాదు. అలాచేయటమే సంభవిస్తే, నా సంసారాన్ని నేను చేతులారా చక్కదిద్దుకోలేక, నాశనం చేసు కొన్నదాన్నవుతాను. అందుకని యింటిల్లిపాదీ సుఖం కోసం, సంఘంలో పేరుప్రతిష్ఠలకోసం, తానెంత కష్టపడితే తనంత బాగుపడినట్లేనని" మనస్ఫూర్తిగా అనుకుంది. దీన్ని ఆధారంగా చేసుకొనే కోడలి పద విని నిర్వహిస్తూ, సంసారబాధ్యతను స్వీకరించింది.

అత్తగారుఆనాడన్న మాటలవల్ల పార్వతిలో యేమార్పు కల్గలేదు. కాని, కాంతమ్మ దృష్టిలో పార్వతి, సావిత్రి వుద్బోధవల్ల పూర్తిగా మారి పోయిందనే దృఢనమ్మకం, గట్టి అభిప్రాయం. ఆ నాటినుంచీ కూడా సీతాపతి మాత్రం ఎవరిపట్లా — యే సానుభూతి - సందేశమూ చూపకుండా - యివ్వ కుండా, తటస్థంగా వుండిపోయాడు. తనకేమీ పట్ట నట్లుగా తిరుగసాగాడు. అలా వుండుటమే కొంత వరకు మంచిదేమోననిపించింది అతనికి..

అలావుండటం కూడా ఒక్కొక్కసారి మానవుడికి సాధ్యపడకపోవచ్చు. కాని, సీతాపతి దృష్టిలోనూ- అత్మలోకూడా తల్లి యెంత పూజ్యురాలో, భార్య కూడా అంతే విశ్వాసవంతురాలు — నమ్మకస్తురాలు. మిగిలింది కూతురు. లేక లేక పుట్టింది. అల్లారుముద్దుగా పెరిగింది. పెళ్ళీడుకొచ్చింది. మాటా—మంచీ—మన్న నలు తెలుసు. సలక్షణంగా ఒకయింటి కోడలై తన సంసారాన్ని తాను నిర్విఘ్నంగా చేసుకోగల్గితే చాక చక్యం తెలిసినదైంది. అలాంటప్పుడు సీతాపతి యెవర్ని, యేమని మందలించగలడు? ఎవరిది తప్పో సీతాపతికి తెలియకగాదు. అసలది తప్పో — ఒప్పో సీతాపతికి తెలియకనూ పోలేదు. ఒకవేళ తాను పక్ష పాత దృష్టితో ఎవర్ని ఏమన్నా, లోకం రకరకా లైన వాదనలతో దుమ్మెత్తిపోసేలాగు విమర్శించు తుంది. అప్పుడు సీతాపతి యేమని నిజం చెప్పగలడు? చెప్పినా ఎవరూ వినరు. నమ్మరు. నలుగురూ హీనంగా ఎంచుతారు. చులకనగాచేసి మాట్లాడు తారు. యీ అగచాట్లన్నింటిని అనుభవించటానికి మనస్కరించకనే, ఆనాడు సీతాపతి మౌనభావం గానూ — తటస్థంగానూ వుండిపోయాడు.

కాంతమ్మకు మాత్రం సీతాపతి అలా చూస్తూ వూరుకోవటం నచ్చలేదు. ఆనాడే, యేదోవిధంగా సావిత్రిని మందలించివుంటే ఎంతో బాగుండేదని అనుకొంది. కాని, అలా అప్పుడూ జరుగలేదు — యింతవరకూ జరుగలేదు. పోనీలే అని విరక్తి భావాన్ని ప్రకటించింది.

ఇలాంటి స్థితిలో ఒకనాడు కాంతమ్మను చూసి పోదామని వచ్చిన ప్రక్కయింటామె సావిత్రి పెళ్లిని గురించి ప్రశ్నించింది. కాంతమ్మ తృప్తిగా యే సమా ధానం యివ్వకుండా మిగతా సంగతుల్ని ప్రస్తావించి పంపించివేసింది.

ఆనాటి రాత్రి సీతాపతి, భోజనానంతరం వాలు కుర్చీలో జారగిల పడుకొనివుండగా, కాంతమ్మ నెమ్మ దిగావచ్చి యెదురుగా కూర్చొని, సావిత్రి పెళ్లి విష యాన్ని కదిపింది. సీతాపతి, తల ప్రక్కకి తిప్పి సావిత్రిని చూసాడు.

మండువా యింట్లో పార్వతి - సావిత్రి యెదు రెదురుగా కూర్చొని కాంతమ్మ కబుర్లు వింటానికి సిద్ధంగా వున్నారు. కాంతమ్మ తన అనుభవాన్నంత టినీ వ్యక్తపరుస్తూ, పరాయి సంబంధానికీ, అయిన సంబంధానికీ గల తేడాల్ని, మంచీ-చెడునీ-మాటా- మర్యాదనీ విపులీకరిస్తూ దాదాపు ఒక అరగంటసేపు సీతాపతిని 'ఊ' కొట్టేటట్టు చేసింది. యీ అర గంటలోనూ సావిత్రికి ప్రతి అరనిముషానికీ అరికాలి మంట నెత్తికెక్కుతూనే వుంది. కాని, ఏం చేయ గలదు? నాయనమ్మ, సయూన తండ్రికి తల్లి. పొంగిన కోపం లోలోపలనే వుంచుకొంది.

(సశేషము)

# స్వీకారం

"రా ఘ వ"

(గతసంచిక తరువాయి)

పార్వతికి మాత్రం అత్తగారి మాటల్లోగల అర్థాన్ని అవగాహన చేసుకొంటున్నకొద్దీ, సావిత్రి ముఖంలో నిరాశాభావంతప్ప వేరే యింకోటి కనిపించటంలేదు. భవిష్యత్‌లో సావిత్రికి గల్గబోయే అన్యాయం ఏరూపంలో వుంటుందోనని భావించసాగింది. ఉన్న ఒక్క కూతురికి న్యాయ్యం చేకూర్చలేకపోతున్నానే అనే దుగ్ధ — ఆదుర్దా హెచ్చుకాసాగింది. ఉన్న ఒక్క కూతుర్ని యిలా పరాయిగా యిచ్చి, బాధలో పడేసి, దిక్కులేనిదాన్నిగా చేసి, ఏడిపించటం తన మాతృత్వంపట్ల తగినపని కాదనుకొని విచారించింది. హృదయం యీ సమస్యతో కల్లోలితమైంది. ముఖంలో దైన్యం ప్రస్ఫుటమవుతోంది. దిక్కుతోచక పార్వతి బెంబేలుపడటం సావిత్రి గ్రహించింది. ఒకప్రక్క కాయనమ్మ మాటలు బాధాకులితమై సావిత్రిని కలవరపరుస్తున్నాయి. మరోప్రక్క పార్వతి దీనస్థితి చూస్తుంటే సావిత్రికి కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

కాంతమ్మ, సీతాపతి యింకా అప్పటికి పెళ్లి ప్రస్తావన సాగిస్తూనే వున్నారు. పార్వతి, సావిత్రి పరితాపంలోనూ — సందేహాల్లోనూ — మునిగితేలుతున్నారు. చివరకు సంభాషణను సాగదీసి — సాగదీసి కాంతమ్మ రెచ్చిపోయింది. సీతాపతికి విసుగెత్తిందేమో! వున్నట్టుండి — "ఇంతకీ నన్నేం చేయమంటావ్?" అని దులపరించుకొంటూ భారమంతా కాంతమ్మ నెత్తిమీదికి తోసేసాడు.

అంతవరకూ మామూలుగా కూర్చున్న కాంతమ్మ, సీతాపతిని అనునయపరుస్తూ, దగ్గరగా చేరి —

"కాస్త నే చెప్పేది బాగా విను. అనవసరంగా అప్రతిష్ఠలపాలు కాకు. పెద్దదాన్ని ఏదో చెబుతున్నానని పెడచెవిని పెట్టకు. తీరా రసాభాస అయిన తరువాత నాలిక్కరుచుకొని పశ్చాత్తాపంపడినా ప్రయోజనంలేదు. ముందే జాగ్రత్తపడటం యిలాంటప్పుడు యెందుకైనా మంచిది, తెలుసా!" — అన్నది. సీతాపతి విసుక్కుంటూ —

"చెప్పేదేదో సూటిగా చెప్పరాదూ! ఎందుకీ డొంకతిరుగుడు మాటలు" — అన్నాడు.

"డొంకతిరుగుడు కాదురా! యింతలోకే అన్నీ విసుగెందుకూ! నేనేం పరాయిదాన్నటరా! నినుత మధ్యపెట్టడానికి కల్లబొల్లి మాటలతో. దూరమాలోచించి చెబుతున్నాను. మనవాళ్లలో ఎవరెటువారైందీ యింకా నీకు తెలియదు. అంతా మంచివాళ్లులాగే కనిపిస్తూ మాట్లాడుతారు. అంతమాత్రానికి వాళ్ళని నమ్ముతున్నావో — కొంప మునిగింతే! కాబట్టి అనవసరంగా బుర్ర పాడుచేసుకోక, చెప్పుడు మాటలు వినక, నే చెప్పినట్లు చెయ్యి" — అని సీతాపతికి ఒక ప్రయత్నాన్ని కల్పిస్తూ—పురిగొల్పింది.

తల్లిమాట ప్రకారం, సీతాపతి చటుక్కున కూర్చున్నవాడల్లా లేచి, పంచాంగం తెచ్చి, గబగబ పేజీలు తిరగవేయడం ప్రారంభించాడు. 'మంచిరోజు ఎప్పుడా?' అని కాంతమ్మ ఆలోచిస్తోంది. సీతాపతి ఒక పావుగంటసేపు పంచాంగం పరిశీలించి రెండు మూడు రోజుల్లో బయలుదేరటం మంచిదన్నాడు. కాంతమ్మ జాగ్రత్తగా వెళ్ళి సంబంధాన్ని నిశ్చయంచేసుకొని రమ్మంది.

తీరా వెళ్ళవలసినరోజు వచ్చింది. సీతాపతి ఆనాడు సాయంత్రం బండికి వెడదామనుకొన్నాడు. కాంతమ్మ యీ రెండు రోజులూ సీతాపతికి చెప్పిందే చెప్పి విసుగెత్తించింది. పార్వతితో మళ్లా యేదైనా సంప్రదించి, తనమాటని నిర్లక్ష్యంచేస్తాడేమోనని, సీతాపతిని ఒంటరిగా వుండనీయక చెంగునకట్టుకొని త్రిప్పింది. అలా రిక్షా ఎక్కేవరకూ వుంచుతూనే వుంది. సీతాపతి రిక్షా ఆ వీధిమలుపు తిరిగేంతవరకూ వెంటవచ్చి — "నీ ప్రయత్నం నువ్వు మనస్ఫూర్తిగా

చెయ్యి. మిగతాదానికి భగవంతుడే వున్నాడు" — అని రిక్షాని స్టేషన్‌వైపుకి సాగనంపింది.

సీతాపతి రిక్షా దిగిదిగటంతోనే, కళ్ళు చెమ్మగిల్లినయి. పార్వతి గుర్తుకొచ్చింది. సావిత్రి — 'నాన్నా' అని వెనుకవైపునుంచి వచ్చినట్లు ఆలాపన. హృదయం ఎందుకో, తరుక్కుపోతున్నట్టుగా వుంది. టికెట్టు తీసుకొన్నాక, సీతాపతి స్థిమితంగా వెళ్ళి ఒక బెంచీ మీద చతికిలపడి, యోచించుకోసాగాడు - బండి రావడానికి యింకా అరగంట ఆలస్యంవుంది. "అమ్మమాటకి ఎదురుచెప్పలేక, అసమర్థుడిలా ప్రవర్తించాను. వచ్చేముందైనా తన ప్రయత్నాన్నిగూర్చి చెప్పకుండా, పార్వతిని కష్టపెట్టానే! నేనెంత పక్షపాతం గలవాడిలా ప్రవర్తించాను! కన్నకూతురి మనస్సెలాంటిదో తెలుసుకోకుండా బుడాబుడావచ్చి టికెట్టుకొన్నాను. నేను నిజంగా ఎంత తెలివితక్కువ పని చేశాను. భార్యకు - కూతురికి తెలియకుండా యీ ప్రయత్నం సఫలీకృతం గావించుకొనివచ్చి, బలవంతంగా వొప్పింపచేయటం నాది అన్యాయమే గదూ! నేను నిజంగా తండ్రిగా వ్యవహరించటం లేదేమో!" — అని యిలా పరిపరివిధాలుగా తనలో తాను వితర్కించుకోసాగాడు.

ఇంతలో బండి వచ్చింది. బాధాస్వాంతనంతో సీతాపతి మూడోక్లాసు పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు. బండి నెమ్మదిగా కదిలింది....

ఆనాటి రాత్రి శాంతమ్మ ఒక్కతే బిక్కుబిక్కుమంటూ పోయి వేరేగదిలో దర్జాగా పడుకొంది.

పార్వతి - సావిత్రి మాత్రం ఒకేగదిలోకిచేరి, సీతాపతి చేసుకొనిరాబోయే ప్రయత్నాన్ని పురస్కరించుకొని మాట్లాడుకోసాగారు. పార్వతి యెంతో దిగులుపడి దిగ్భ్రమించుకొని సావిత్రిని అనునయపర్చటం మొదలెట్టింది. కాని సావిత్రి, తల్లి మాటని కాదంటూ వుద్రిక్తంగా మాట్లాడటం ప్రారంభించింది. పార్వతి, యిక యేం మాట్లాడాలో తెలియని స్థితిలో వుండగా -

"నన్ను చివరకు మీరంతాకలిసి పరాయివాడికప్పగిస్తారని యెన్నడూ కలలోకూడా అనుకోలేదు. కని - పెంచి - చదువుచెప్పించి పెద్దదాన్ని చేశారు. యెందుకూ - ఏడిపించడానికేగా! ఒక్కగానొక్క ఆడపిల్లనైనందుకు, కొంతగాకపోతే కొంతవరకైనా, నా వ్యక్తిగతాభిప్రాయంలో స్వేచ్ఛనిస్తారేమోనని ఆశపడ్డాను. నా జీవితం సుఖవంతంగాచేసి తీరుతావనే యింతవరకూ ఆశిస్తూవచ్చాను. చివరకు నువ్వైనా కల్పించుకొని నాన్నతో నా వుద్దేశ్యాన్ని చెబుతావేమో ననుకున్నాను. మనస్ఫూర్తిగా వువ్విళ్ళూరిపోయాను తప్పకుండా తెలియపరుస్తావని. తీరా బయలుదేరేంతవరకూ వేచివున్నాను. చెప్పకుండా వూరుకొన్నావ్. కనీసం నన్నైనా చెప్పమని గుర్తుచేయలేదు. నా మనస్సులోగల వుద్దేశ్యాన్ని ఆనాడే నీకు చెప్పానుగా! అంతావిని సరేనన్నావుగా! అమ్మా!" —

పార్వతి యీ మాటలు వింటూ కన్నీరుకార్చటం మొదలెట్టింది.

"అమ్మా! నువ్వు అనవసరంగా యిప్పుడేడ్చి యేమిటీ లాభం? నిజంగా నామీద నీకు ప్రేమే వుంటే, నాన్నతో యీ విషయాన్ని చెప్పటానికి జంకుతావా? అమ్మా! నేను మురారిబావను కోరి పెళ్ళి చేసుకుంటాననటం తప్పేనంటావా? మీకిష్టం కదా? నేనిలా పెళ్లి చేసుకుంటాననటం! యీడైనవాడనీ, చదువుకున్నవాడనీ, ఎన్నోసార్లు నువ్వే అన్నావ్‌గదా! యీనాడు ఆ వాత్సల్యపూరితమైన మాటలన్నీ, నాన్నముందు ఏమైపోయినయి? నా జీవితానికి మేలుచేయాలని మీకెప్పుడూ లేదని గ్రహించాను. నీకు మేనరికం కలుపుకోవాలనివుంటే, యిలా చేస్తూవుంటే, చూసి వూరుకోగలవా అమ్మా! అయినవాళ్ళలో వున్న సంబంధబాంధవ్యాలను తెగత్రెంపులు చేసుకొని, నా మనస్సులో చిచ్చుపెట్టి, మేనరికాన్ని వదిలి, నాకు మురారిబావను దూరం చేసి, నేను పరాయిదానిగా సంసారంచేస్తూ, యమయాతనలను అనుభవిస్తూండడం మీకిష్టమా! అమ్మా! నా జీవితాన్ని యెందుకిలా తయారుచేయాలనుకొంటున్నారు? నన్ను పరాయివాడికిచ్చి, మీరు పొందేసుఖం యేమిటి?" — అని సావిత్రిని చిత్రవధ చేస్తున్నట్లుగా మాట్లాడేసింది. పార్వతికి సావిత్రిలో యింత వుద్రేకం వుందని తెలియదు. చేసేదేంలేక, కూతుర్ని దగ్గరకు తీసుకొంటూ —

"నేను నీకేం అన్యాయమూ చేయటంలేదు. ఒకరితో చేయమనీ చెప్పటంలేదు. నా స్థితి యెలాంటిదో యింకా నీకు తెలియదు. యిలాంటి సమయంలో నేనేది అన్నా, పరిస్థితులు యింకా ఘోరంగా పరిణమిస్తయి. అన్నిటికీ ఆ సర్వేశ్వరుడే వున్నాడు. మనం చేయగల్గిందేం లేదు. నువ్వనవసరంగా వుద్రేకపడకు. ఆడదానికి అసలు వుద్రేకం వుండగూడదు" — అని కళ్లు తుడుస్తూ, సావిత్రిని ఓదార్చింది.

అప్పటికి గడియారం పదకొండు గంటలు కొట్టింది. వర్షం సందెవేళనుంచి కురిసి, కురిసి, యీదురుగాలితోపాటు ఆగిపోయింది.

సావిత్రిని నిద్రపుచ్చేసరికి, పార్వతికి పెద్దలు దిగొచ్చారు. కాని, పార్వతికి మాత్రం నిద్ర తేలిపోయింది. సావిత్రి అన్నమాటలు పుంఖానుపుంఖంగా గుర్తుకొస్తుంటే, గుండె ద్రవీభూతం అయిపోసాగింది. తనకితాను ఎంత ఓదార్చుకున్నా ప్రయోజనం శూన్యమనిపించుతోంది. చేతులారా కన్నకూతురు గొంతు నులుముతున్నానే అని క్షోభించింది. తనకీయింట్లో ఏమాత్రమూ స్వేచ్ఛా - స్వతంత్రమూ లేకపోయింది కాబట్టే, సావిత్రి యీ గతికి వచ్చిందని కకావికలపడసాగింది. పరాయిసంబంధం చేసినందువల్ల, అమ్మలక్కలూ - బంధువర్గం - వేళాకోళాలతో వెక్కిరిస్తారేమోనని భయపడటం మొదలెట్టింది. భర్తమాట కాదని తనేం చెప్పగలదు? అత్తగారి మాటకు అడ్డువచ్చి గెల్చేదెట్లు? కన్నకూతురివల్ల తనకెలాగూ తీరని ముచ్చ - కోరని అవమానం ప్రాప్తమవుతాయని నిశ్చయించుకొంది. నేనే సావిత్రి జీవితాన్ని - సుఖాన్ని - భగ్నపరచి, అన్యాయం చేశానని లోకం తప్పకుండా అనుకొని, తిట్టిపోస్తుందని నిర్ధారించుకొంది. పార్వతికి యింతేగాకుండా యింకా కొన్ని ఆలోచనలు కలిగినయి.

మురారిమీద సావిత్రికి మనసు కుదరటంలో ఆశ్చర్యమేమీ కలగలేదు. సావిత్రి యిందులో చేసిన తప్పేమీలేదని తెలుసు! కలిగిన వ్యక్తిగతాభిప్రాయాన్ని వెళ్ళబుచ్చినా ప్రయోజనం ఏమిటీ! ఎలా సాధ్యపడుతుంది. సావిత్రి కోర్కె ఎలా తీరుతుంది? తను తీర్చలేదు, యింకెవరూ తీర్చేది? యింకెప్పుడు తీరుస్తారు? అసలీ విషయాన్ని భర్తకిగానీ, అత్తగార్కిగాని తెలియపర్చేదెవరు? తనకా వాక్స్వాతంత్ర్యంలేదు. యింకెలా సావిత్రి బాగుపడేది? సుఖపడేది? అసలు మురారిమీద సీతాపతికీ, కాంతమ్మకీగల ప్రత్యేకాభిప్రాయం యేమిటో ఎవ్వరికీ తెలియదు. ఇలాంటి దుస్థితిలో సావిత్రి, మురారికి చరణదాసి యెలా కాగలుగుతుంది? తనకి తెలుసు యీ సంగతంతా. అందుకనే పార్వతి తనలో తాను సావిత్రిని గురించి అహర్నిశలూ, ఎడతెరపే లేకుండా ఆలోచించసాగింది. సావిత్రి మాత్రం కలత నిద్రలో యేవేవో మాటలు వుచ్చరించుతోంది...ఆ నాటినుంచి...

3

ఒకవారం రోజులు గడిచిన పిదప సీతాపతి ఒకనాటి మధ్యాహ్నానికల్లా తిరిగొచ్చాడు. కాంతమ్మ యెదురుగా వెళ్ళి సీతాపతి చేతిలోని సంచిని అందుకుంటూ ఆత్రంకొద్దీ పల్కరించింది. ఇంతలో పార్వతి కాళ్ళు కడుక్కొంటానికి నీళ్ళు అందిచింది సీతాపతికి. అతను కాళ్ళు కడుక్కొంటూ — "అమ్మాయి ఏదమ్మా?" - అని కాంతమ్మ వంక చూస్తూ ప్రశ్నించాడు. మంచినీళ్లు చేతికిస్తూ పార్వతి - "గదిలో వుంది" అన్నది మామూలుగా. కాంతమ్మ, పార్వతి వంక అదోలా చూస్తూ — "కొడుకు తన్నడిగినప్పుడు, నువ్వెందుకు జవాబిచ్చావ్?" అని మనస్సులో అనుకుంది.

సీతాపతి నెమ్మదిగా అనుష్ఠానాలన్నీ పూర్తిచేసుకొచ్చి, తాపీగా కుర్చీలో కూర్చొని — "చివరికి సంబంధం కుదుర్చుకొచ్చేటప్పటికి తాతలు దిగొచ్చినంత పనైంది" — అన్నాడు ఒక్కనిట్టూర్పు భారంగా విడుస్తూ. ఆ మాట వినేసరికి, కాంతమ్మ మనస్సు మిగతా విషయాలకోసం ఆరాటపడింది. నిజంగా యీ సంబంధం చాలా కష్టపడి కుదుర్చుకొని రాగలిగాడనీ, తను చెప్పినట్లుగా బుద్ధిమంతుడిలా చేసుకొచ్చాడనీ యెంతో సంతోషించింది.

పార్వతి భర్త వెనకాలే నిల్చుని చెప్పబోయే మాటల్ని శ్రద్ధతో విందామనుకొనసాగింది. గదిలో మాత్రం అంతవరకూ ఏకాంతంగావున్న సావిత్రి మెల్లగా లేచివచ్చి తల్లి ప్రక్కనే నిలబడింది.

సీతాపతి కుదుర్చుకొచ్చిన సంబంధ వివరాల్ని నొక్కిచెపుతూ — "అమాంబాపతూ లాంఛనాలతో సహా మొత్తం మూడువేల ఐదు వందలకు వొప్పుకున్నాను. కుర్రవాడు B.A. ప్యాసయి ప్రస్తుతం తాత్కాలికోద్యోగం చేస్తున్నాడు గుంటూరులో. పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా, వుంటానికి ఒక పెంకుటిల్లు వుంది. తండ్రిలేడు, కుర్రవాడు చామనఛాయగా వుంటాడు. అమ్మాయికి యీడుగా వుంటాడనుకొంటున్నాను" - అని చెబుతూ సావిత్రి వంక చూశాడు.

సావిత్రి పరాన్ముఖురాలైంది.

ఇంతలో కాంతమ్మ - "పేరేమిటీ?" - అన్నది.

పార్వతి, తన మనస్సులో - "ఇక పేరేదైతేనేం?" నిర్వేదంతో. సీతాపతి — "రమణమూర్తి" అన్నాడు జవాబుగా.

కాంతమ్మ కాబోయే పెళ్ళికొడుకు పేరు చెవులారా వినేసరికి ఆ యేడుకొండల వేంకటరమణుడు, తన మనుమరాలికి ప్రత్యక్షమై భర్తగా కాబోతున్నాడని – పరమానందపడింది.

“మరి ముహూర్తాలెప్పుడు పెట్టుకుందాం?” – అని కాంతమ్మ వుండబట్టలేక ప్రశ్నించింది.

“వచ్చే మాఘమాసంలోనే ..యింకా ఆలస్యం దేనికి?” – అన్నాడు సీతాపతి. అంతవరకూ పార్వతిగానీ, సావిత్రిగానీ యేం మాట్లాడలేదు.

మాఘమాసం వచ్చేలోపుగా, రమణమూర్తి, అతని తాలూకువారు ఒకసారి కాబోలు వచ్చి సావిత్రిని చూసి సంబంధాన్ని మనస్ఫూర్తిగా స్థిరపర్చుకున్నారు. యిరుపక్షాలవారూ కట్నాలకు ఒప్పుకున్నారు. రమణమూర్తి మాత్రం తనవాళ్ళెవరడిగినా, సావిత్రిని గురించి పెద్దగా యేమీ పొగుడుతూ చెప్పలేకపోయాడు. కనీసం తన తల్లికి కూడా తన హృదాభావాన్ని వెలిబుచ్చలేదు. తనలో తనే తృప్తిపడి వూరుకున్నాడు. యిలా కార్యకలాపాలన్నీ పూర్తి చేసుకునేసరికి వుత్తరాయణ పుణ్యకాలం వచ్చింది. యిరుపక్షాలవారు తాంబూలాలు యిచ్చిపుచ్చుకున్నారు. జాతకాల ప్రభావంవల్ల లగ్నం మంచిదే కుదిరిందని వారూ – వీరూ కూడా పెళ్లి పనులు చేయటానికి పూనుకొన్నారు సంతోషంతో.

సావిత్రిలో అంతవరకూ వున్న అభిప్రాయానికి ఆయువుపోయింది. తను చదువుకొన్నందుకూ – సంస్కారం కల్గివున్నాననుకున్నందుకూ, అనగా యింతకాలమూ బ్రతికివున్నందుకూ ప్రయోజనం లేకపోయేసరికి, విరక్తిగా విచారపడటం మొదలెట్టింది.

సావిత్రి యిప్పుడు కుంపటిలో కుసుమంలాగా వుంది. తెనిపోని ఆలోచనలతో కుమిలిపోసాగింది. కన్నతల్లిదండ్రులుండి కూడా తనకే వుపయోగము చేయలేకపోయేసరికి యిక యిలా బ్రతకటం అనవసరమనుకొంది.

ఆనాడు సీతాపతి యింటివద్ద లేడు. కాంతమ్మ చేసినపనినే, పదిసార్లు ‘శుభ్రం’ అంటూ చేయటం ప్రారంభించింది. పార్వతిని ఒక్క నిముషం కూడా తీరిగ్గా వుండనీయటంలేదు. యేదో పనిని పురమాయిస్తూ, పార్వతి యెముకల్ని కొరుక్కుతినటం మొదలెట్టింది. పార్వతి అన్నిరకాల హింసలకూ లొంగిపోయి, కూతురి ముఖం చూస్తూ, కన్నీటిని ఆపుకొంటూ అన్నిపనులూ చేయసాగింది.

సావిత్రి మాత్రం ఒంటరిగా తన గదిలో కూర్చొని సుఖపడవలసిన జీవితం యిలా అయిపోయిందేమిటూ! అని విచారించటం మొదలెట్టింది. ఆలోచిస్తున్నకొద్దీ తనమీద. తనకే విరక్తి – వెగటు పుట్టింది. ఎవర్నేమన్నా లాభం లేదనుకొంది. అప్పటి మురారిని చూసి చాలా కాలమైంది. ప్రభుత్వోద్యోగిగా బళ్ళారి వెళ్ళిన క్రొత్తలో మురారి, పార్వతి పట్ల వుండే ప్రేమాభిమానాలకొద్దీ, సీతాపతి పేరిట అడపా – తడపా వుత్తరాలు వ్రాస్తూండేవాడు. అందులో మేనత్తయిన పార్వతికి వందనాలు, మరదలైన సావిత్రికి ఆశీర్వచనాలు తెలుపుతూండేవాడు. ‘నీ ఆశీర్వచన ప్రభావంవల్ల నేను కులాసాగా చదువుకొంటూనే వున్నాను బావా!’ అని యెప్పటికప్పుడు ఒక వుత్తరం సరదాగా వ్రాయాలనుకొనేది సావిత్రి.

(సశేషము)

---

పాతూరి డుగారి

# బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

## డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు–4. Phone 71354

కుంభకోణము బ్రాంచి : 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.